సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 12 । ఆగస్టు । 2023



భక్తుల కొంగుబంగారం ముత్తుమారెమ్మ

నందలూరు రైల్వేకేంద్రంలోని అరవపల్లెలో వెలసిన ముత్తుమారెమ్మ జాతర శనివారం నుంచి జరగనుంది. -10లో



రెప్పపాటులో దూసుకొచ్చిన మృత్యువు

కురబలకోట మండలం అంగళ్లు గ్రామంలో బొలేరో వాహనం ఢీకొనడంతో డిగ్రీ విద్యార్థి నాసీర్ మృతిచెందాడు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.400
రెండోరకం	రూ.210	రూ.288



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 402 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	550
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 169.480 కిలోలు

సున్నా వడ్డీతో ఆర్థిక ప్రగతి

- కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి.
- జిల్లాలో 28,545 స్వయం సహాయక సంఘాలకు రూ. 41.75 కోట్లు విడుదల

రాయచోటి: స్వయం సహాయక సంఘాల మహిళలలో ఆత్మస్థైర్యాన్ని పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మహిళల్లో ఆర్థిక భరోసాను నింపేందుకే వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ప్రభుత్వవిప్ రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు సంయుక్తంగా పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, జనుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ వేదిక ద్వారా వరుసగా నాలుగో ఏడాది స్వయం సహాయక సంఘాలకు మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం లబ్ధి మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాలు హాజరయ్యారు. ముఖ్యమంత్రి కార్యక్రమం అనంతరం వరుసగా నాలుగో ఏడాది సంబంధించి వైఎస్సార్ సున్నావడ్డీ పథకం కింద జిల్లాలోని పట్టణ, గ్రామీణ పరిధిలోని 28,545 సంఘాలకు మంజూరైన రూ. 41,75కోట్ల మొత్తాన్ని వారు లబ్ధిదారులకు మెగా చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక ప్రగతికోసం సున్నా వడ్డీ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలలో జమచేసి రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. ముఖ్యమంత్రి తన సుదీర్ఘపాదయాత్రలో చేసిన హామీలన్నీ నెరవేర్చుతున్నారన్నారు. నాలుగో ఏడాది వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం క్రింద జిల్లా వ్యాప్తంగా పట్టణం, గ్రామీణంలో ఉన్న 28,545 స్వయం సహాయక సంఘాలకుగాను సున్నా వడ్డీ సాయం మొత్తం రూ. 41.75 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మహిళ బాగుంటేనే ఇల్లు బాగుంటుందని, తద్వారా గ్రామం, రాష్ట్రం సమాజం బాగుంటుందని నమ్మి ముఖ్యమంత్రి ఆలోచన చేసి 90శాతం పథకాలు మహిళల పేరిట అమలు చేస్తున్నారన్నారు. రాయచోటిలోని అన్నిచోట్ల అమూల్ పాలను సేకరిస్తున్నారు. గుజరాత్‌లో ఉన్న అమూల్ గ్రూపు దాదాపు రూ.500 కోట్ల టర్నోవర్ చేస్తుందన్నారు. మనం కూడా అలాగే ముందుకెళ్లాలన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించి పొదుపు సంఘాల్లో ని పేదింటి అక్కచెల్లెమ్మల మీద వడ్డీ భారం పడకుండా ప్రభుత్వమే వారి తరపున వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద ఆ భారాన్ని భరిస్తుందన్నారు.



లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తదితరులు

మహిళలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంను ప్రవేశపెట్టిందన్నారు. పొదుపు సంఘాల విషయంలో ముఖ్యమంత్రి ఎంతో మేలు చేయాలనే సదుద్దేశంతో చెప్పిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతలుగా రుణమాఫీ చేశారన్నారు. గత ప్రభుత్వ పాలన లో ఎప్పుడు కూడా సున్నావడ్డీ జమ కాలేదన్నారు. షెడ్యూల్ ప్రకారం సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయన్నారు. రాయచోటి నియోజకవర్గంలో రూ. 7 కోట్లు, రాయచోటి మున్సిపాల్టీలో రూ. 1.20 కోట్లు ఇప్పటి వరకు దాదాపు నాలుగు విడతలు రూ. 30 కోట్లకు పైగా అందజేసినట్లు తెలిపారు. పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని ఆర్పీలకు ఎమ్మెల్యే సూచించారు.మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు పడుతున్న కష్టాలను తన పాదయాత్రలో కళ్లారా చూసిన మన ముఖ్యమంత్రి సున్నావడ్డి కే రుణాలు ఇస్తానని హామి ఇచ్చారని, ఆ హామీని అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎల్‌డీఎం వెంకటేశ్వరరెడ్డి, డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది, గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



నాపేరు వి పద్మజ. రాయచోటి మండలం, కొత్తపేటలో నివసిస్తున్నాను. బద్రీ పొదుపు స్వయం సహాయక సంఘంలో మొదటి లీడర్‌ను. మా గ్రూపు సభ్యులం రూ. 10 లక్షలు ఏపీజీబీ బ్యాంకులో రుణం తీసుకున్నాం. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో నాలుగో విడతలో రూ. 23 వేలు జమ అయ్యాయి. నేను టైలరింగ్ షాప్ ద్వారా జీవనం గడుపుతున్నాను. సీజన్ బట్టి నెలకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేలు వస్తుంది. ముఖ్యమంత్రి మహిళల పేరిట అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం చాలా సంతోషంగా ఉంది. – వి పద్మజ, కొత్తపేట, రాయచోటి మండలం

ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోంది



నాపేరు వి శివమ్మ, రాయచోటి మండలం, సిబ్యాల గ్రామంలో నివసిస్తున్నాను. వీరభద్ర పొదుపు సంఘంలో మొదటి లీడర్‌గా ఉన్నాను. మా సంఘం తరపున రూ. 10 లక్షలు రుణం కెనరా బ్యాంకులో తీసుకున్నాం. వచ్చిన డబ్బులతో ఆవులు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాను. నెలకు రూ. 15 వేలు ఆదాయం వస్తుంది. సున్నా వడ్డీ పథకం క్రింద రూ. 21 వేలు జమ అయ్యాయి . అన్ని విధాలుగా ప్రభుత్వం మమ్ములను ఆదుకుంటుంది. –వి శివమ్మ, సిబ్యాల గ్రామం, రాయచోటి మండలం

జగనన్నకు రుణపడి ఉంటాను



నా పేరు లక్ష్మీదేవి.సంబేపల్లి మండలం, దుద్యాల గ్రామం, పెద్ద జంగంపల్లిలో నివసిస్తున్నాను. విజయలక్ష్మీ పొదుపు సంఘంలో మొదటి లీడర్‌ను. మా గ్రూపు ద్వారా రూ. 15 లక్షల బ్యాంకు రుణం పొందాం. అందులో నా వాటా రూ. 1.50 లక్షతో చీరల వ్యాపారం చేస్తున్నాను. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం క్రింద నాలుగో విడత రూ. 22 వేలు మా సంఘానికి జమ అయ్యాయి . నెలకు రూ. 15 వేలు నుంచి రూ . 20 వేలు ఆదాయం వస్తుంది. జగనన్నకు రుణపడి ఉంటాను.
–లక్ష్మీదేవి, సంబేపల్లి మండలం, దుద్యాల గ్రామం, పెద్ద జంగంపల్లి

పాత సర్వీస్ రూల్స్ ప్రకారమే పదోన్నతులు

- ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

మదనపల్లె సిటీ: పాత సర్వీసు రూల్స్ ప్రకారం 1100 మంది ఉద్యోగులకు పదోన్నతులు త్వరలో రానున్నాయని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు అన్నారు. గురువారం స్థానిక టౌన్‌హాలులో ఈయూ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను సెప్టెంబర్ నెలాఖరులోగా చెల్లించడానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. క్యాడర్ సంఖ్య వల్ల ఉద్యోగులకు ఉత్పన్నమౌతున్న సమస్యలను తొలగిస్తామని ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో నం.70,71 ద్వారా కాండక్ట్, సీసీఏ నిబంధనలలో ఉన్న విషయాలను ఉద్యోగులకు అర్థమయ్యే విధంగా వివరిస్తూ ఇవన్నీ పాతవనేని కొన్ని సంఘాల నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ఉద్యోగుల భద్రత కోసం ఇచ్చిన 01/2019 సర్కులర్‌ను అధికారులు అన్ని చోట్ల యథావిధిగా అమలు చేసి ఉద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా చూడాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ డిపో గౌరవ అధ్యక్షుడు జింకాచలపతి మాట్లాడుతూ ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య,డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్, జోనల్ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వల్లి, నాగభూషణరెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు కృష్ణప్ప,ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నాయకులు సుబ్రమణ్యం, మధు, ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రూ.2,75లక్షలకు నిత్యపూజ స్వామి తలనీలాల వేలం

సిద్ధవటం: శ్రీ నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల బహిరంగ వేలం పాటను శుక్రవారం సిద్ధవటంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో నిర్వహించారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం గ్రామానికి చెందిన దాసరి మనోమర్ రూ.2,75,000 లకు వేలంపాటను దక్కించుకున్నారని ఆలయ ఈఓ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులు స్వామివారికి సమర్పించుకునే తలనీలాల పోగు కోసం ఈ వేలం పాటను నిర్వహించామన్నారు.ఇందులో గుంటూరు, ప్రొద్దుటూరు, చాపాడు, మైదుకూరు, వంతాటిపల్లె ప్రాంతాలకు చెందిన 8 మంది పాల్గొన్నారన్నారు. ఈ పాటను గుంటూరు జిల్లా ఫిరంగిపురం గ్రామానికి చెందిన దాసరి మనోహర్ దక్కించుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది స్వామి వారికి అదనంగా రూ. 24 వేలు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో రాజంపేట దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ చైర్మన్ పాటూరు కొండారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, పాటాదారులు, వంతాటిపల్లె గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



మాట్లాడుతున్న డీఈవో శ్రీరాం పురుషోత్తం

రాయచోటిటౌన్: బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం విద్యాశాఖాధికారులకు సూచించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడి బయటి పిల్లల నమోదు, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, ప్రభుత్వ పాఠశాలలో చదివే 10–19 సంవత్సరాల మధ్య చదివే ఆడ పిల్లల గుర్తింపు, వారికి ఇవ్వాల్సిన ఐఎఫ్ఏ వంటి కార్యక్రమాల గురించి ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ 10 –19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ఆడ పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత కలిగిన వారికి ఐరన్ పోలిక్ యాసిడ్ (ఐఎఫ్ఏ) ఇవ్వాలన్నారు. మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, మండల స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంఈవో బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

లక్కిరెడ్డిపల్లి: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలోని సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారిని తొలగించి, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని బీఎల్ఓలకు సూచించారు. సచివాలయ సిబ్బంది కూడా సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ శంకర్ రాజు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి, ఆర్ఐ సమ్మత్ ఖాన్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించాలి

రామాపురం: బీఎల్ఓలు ఓటరు నమోదు ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. మండలంలోని కుమ్మరపల్లె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు.గ్రామంలో జరుగుతున్న ఓటు నమోదు కోసం చేస్తున్న ఇంటింటి సర్వే గురించి బీఎల్ఓలతో మట్లాడారు. అనంతరం అమరవీరుల సంస్మరణార్థం మొక్కలు నాటారు. తహసీల్దార్ అరవింద్‌కిషోర్, ఎంపీడీఓ హైదర్‌వలి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బసిరెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష ఫలితాలు విడుదల

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డీపీఈడీ, బీపీఈడీ కోర్సుకు సంబంధించిన తృతీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జూలై నెలలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన డీపీఈడీ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. బీపీఈడీ ఫలితాల్లో 84.87 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు.

రాష్ట్ర వ్యాప్తంగా నగరవనాలు



రాజంపేట నగరవనంలో మీడియాతో మాట్లాడుతున్న వై.మధుసూదన్‌రెడ్డి

రాష్ట్ర పీసీసీఎఫ్ మధుసూదనరెడ్డి

రాజంపేట: నిత్యం ఒత్తిడితో గడిపే నగరవాసికి ఆహ్లాదం పొందేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నగరవనాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ పారెస్టు(పీసీసీఎఫ్) వై.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజంపేట రేంజ్ పరిధిలోని ఎస్ఆర్ పాళెం సమీపంలో ఏర్పాటుకానున్న నగరవనాన్ని ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనువాసులు, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు అటవీ అందాలను వీక్షించేలా ప్రతి పట్టణ ప్రాంతాలకు దగ్గరలో వీటిని ఏర్పాటు చేయాలన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో నగరవనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

- రాజంపేటలో దాదాపు రూ.2కోట్లతో నగరవన్ని సుందరంగా తీర్చిద్దిందేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పీసీసీఎఫ్ వై.మధుసూధనరెడ్డి అన్నారు.

ఎమ్మెల్యే మేడా, కొరముట్ల, జెడ్పీచైర్మన్‌లు మాట్లాడుతూ పట్టణానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరవనం భవిష్యత్తులో పట్టణవాసులకు అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు పంజం సుకుమార్‌రెడ్డి, కర్నూలు సీసీఎఫ్ ఎం.నాగేశ్వరరావు, అన్నమయ్య జిల్లా అటవీఅధికారి సందీఫ్, వైఎస్సార్ జిల్లా అటవీఅధికారి వివేక్ , సోషల్‌ఫారెస్టు డీఫ్ఓ నాగమునేశ్వరి, రాజంపేట రేంజర్ నారాయణ, మున్సిపాలిటి సచివాలయాల కన్వీనరు వడ్డెరమణ,మున్సిపాలిటి కమిషనరు జనార్ధన్‌రెడ్డి, డీఎస్పీ చైతన్య, వైఎస్సార్‌సీపీ బీసీ పార్లమెంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీఎఫ్‌కు ఘనస్వాగతం

మేడాభవన్‌లో రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ వై.మధుసూదన్‌రెడ్డికి ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పీసీసీఎప్‌కు శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, పసుపులేటి సుధాకర్, పట్టణ సచివాలయకన్వీనరు వడ్డెరమణ, రూరల్ కన్వీనరు మందరం గంగిరెడ్డి పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించాలి

అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లా ప్రజలందరిలో దేశభక్తి భావాలు రేకెత్తించేలా పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటైన తర్వాత రెండోసారి జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకోబోతున్నామన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలను కనువిందు చేసే రీతిలో నిర్వహిద్దామని ఆయా శాఖల జిల్లా అధికారులతో అన్నారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాట్లు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా, అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. ప్రభుత్వ శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అభివృద్ధిపై సందేశ బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలని డీపీఆర్ఓను ఆదేశించారు. అత్యంత ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాల జారీకి జాబితాను సిద్ధం చేయాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీతో కలిసి పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించి వివిధ శాఖల అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, ఎస్పీ గంగాధర్‌రావు, డీఆర్ఓ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ గంగాధరరావుతో కలిసి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

అర్జీలను పరిష్కరించాలి

రాయచోటి: జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి కలెక్టరేట్ మినీ వీసీలో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించి అర్జీదారుల సమస్యలకు మరింత మెరుగైన పరిష్కారం చూపేలా తపన, తాపత్రయంతో అధికారులు పనిచేయాలని కలెక్టర్ అన్నారు. మారుమూల గ్రామాల నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని స్థాయిల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అర్జీదారుకి సంతోషాన్ని కలిగించేలా ఆ మనిషి ముఖంలో చిరునవ్వులు చిందించేలా పరిష్కారం చూపాలన్నారు. ప్రతి బుధవారం మండల స్థాయి కమిటీ మీటింగ్ పెట్టుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ గంగాధర్ రావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి సమస్య అయినా పరిష్కరించవచ్చన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజకమల్, డిఆర్ఓ సత్యనారాయణ, ఆర్‌డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళీ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, డివిజన్, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..!

- 17 నుంచి శ్రావణమాసం
- 18 నుంచి శుభ ముహూర్తాలు
- కల్యాణ మండపాలకు డిమాండ్

మదనపల్లె సిటీ: ఆషాడమాసం, అధిక శ్రావణంతో నిలిచిపోయిన శుభకార్యాలు మళ్లీ ఊపందుకోనున్నాయి. పట్టణంతో పాటు గ్రామాల్లో సన్నాయి మేళాలు మోగనున్నాయి. 17 నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుంది. ఈనెల 19 నుంచి మంచి డిసెంబర్ వరకు వరుస మహూర్తాలు ఉండటంతో పెళ్లి సందడి నెలకొంది. ఆగస్టు 16న అమావాస్య అనంతరం నిజ శ్రావణమాసం వస్తుండటంతో 19 తేదీ నుంచి దాదాపు 10 రోజుల పాటు వరుసగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఇవి డిసెంబర్ వరకు కొనసాగనున్నాయి. డిసెంబర్ వరకు 50 ముహూర్తాలు ఉండటంతో సుమారు వెయ్యికిపైగా వివాహాలు జరగనున్నాయి. జిల్లాలో ప్రధానంగా మదనపల్లె, రాయచోటి, రాజంపేటతో పాటు పట్టణాలు,గ్రామాల్లో సైతం కల్యాణ మండపాలు వెలిశాయి

వివిధ వర్గాలకు పని:

శుభ ముహూర్తాలు ప్రారంభం కావడంతో చాలా మందికి చేతినిండా పని దొరుకుతుంది. పురోహితులు, మంగళవాయిద్యాలు, వంట మనుషులు, డెకరేషన్స్, పూల అలంకరణలు, ట్రావెల్స్, షామియానాలు, క్యాటరింగ్, బ్యూటీషియన్లు, బ్యాండ్‌మేళాలు(డీజె)తో పాటు కూలీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. కళ్యాణవేదికలు, ఇతర హోళ్ల ముందుగానే బుకింగ్ అయిపోయాయని యజమానులు చెబుతున్నారు.

- జిల్లాలో ప్రధానంగా పెండ్లి పట్టుచీరలకు మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె ప్రసిద్ధి. ఇక్కడికి పలు ప్రాంతాల నుంచి వచ్చి పట్టుచీరల కొనుగోలు చేస్తున్నారు. దీంతో పట్టుచీరల దుకాణాలు కళకళలాడుతున్నాయి. బంగారం కోసం రాయచోటి, ప్రొద్దుటూరు, మదనపల్లెలో కొనుగోలు చేస్తున్నారు. పెండ్లిళ్లకు ప్రత్యేక డిజైన్లు తయారు చేశారు.



పెరిగిన అద్దెలు:

చాలా రోజుల తరువాత కల్యాణ మండపాలు కలకళాడనున్నాయి. వీటికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు అద్దె చెల్లించాల్సి ఉంది. వివాహ ముహుర్తాలు ప్రారంభమయ్యే నాటికి దాదాపు అన్ని కల్యాణ మండపాలు, ముహుర్తాలు గల అన్ని రోజుల్లో ముందే రిజర్వు చేసుకున్నారు. షామియానాలు, వంటమనుషులు, భజంత్రీలతో పాటు దుస్తులకు, క్యాటరింగ్‌లకు గిరాకీ ఏర్పడింది. విందు భోజనాలు ప్లేటు రూ.150–180 వరకు ఉండగా, ప్రస్తుతం రూ. 200–250కి పెరిగింది. ప్రస్తుత ముహూర్తాలు వివాహాలతో పాటు గృహప్రవేశాలు, భూమిపూజ, ఉపనయనాలు, బారసాలా వంటి శుభ కార్యాలు జరగనున్నాయి. దీనికితోడు శ్రావణమాసం పండుగల సీజన్ ప్రారంభం కావడంతో ధరలు మరింత పెరిగిపోయాయి.

మంచి ముహుర్తాలు..



ఏప్రిల్ నుంచి శుభ కార్యాలు లేవు. జులైలో ఆషాడమాసం రావడంతో పెళ్లిళ్లకు బ్రేక్ పడింది. ఆగస్టు నెలలో వివాహ ముహుర్తాలు ఉన్నాయి. ఆగస్టు 18,20,21,23,27,31 , సెప్టెంబర్ నెలలో 1,3,10 తేదీల్లో పెళ్లికి ముహుర్తాలున్నాయి.
–సాయిచక్రవర్తి, పురోహితులు, మదనపల్లె

22న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు జెడ్పీలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ ఉమ్మడి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, అధికారులు ఆ రోజు ఉదయం 9 గంటలకే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఆర్ట్స్ కళాశాలలో రెండో విడత డిగ్రీ ప్రవేశాలు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ప్రవేశాల కోసం రెండోవిడత ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సులలో ప్రవేశాల నిమిత్తం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు వచ్చేవారంలో ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చని సూచించారు.

ఎస్‌ఈబీ దాడులు

మదనపల్లె : పట్టణంలోని నక్కలదిన్నెలో అక్రమ నాటుసారా తయారీ, అమ్మకాలు అరికట్టడంలో భాగంగా ఎస్‌ఈబీ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. 100 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్ట్ చేసి, మరో ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆదేశాల మేరకు ఎస్‌ఈబీ మదనపల్లె ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నక్కలదిన్నె తండాలో దాడులు నిర్వహించామన్నారు. అక్రమంగా సారా అమ్మకాలు సాగిస్తున్న నందిని, మంజులమ్మ, చిట్టి, ప్రేమ, శ్యామలమ్మపై కేసు నమోదు చేసి 100 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించి అక్రమంగా నాటుసారా అమ్మకాలు సాగిస్తున్న మంగమ్మ, సాలమ్మపై కేసు నమోదు చేశామన్నారు. వీరికి సరుకు సరఫరా చేసే సారా తయారీ, సరఫరాదారులు అయిన మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను మదనపల్లె మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిస్తే 14 రోజుల రిమాండ్ విధించినట్లు వివరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాజంపేట : పట్టణంలోని బైపాస్‌రోడ్డు ఉస్మాన్‌నగర్ సమీపంలోని ముళ్లపొదల్లో గుర్తుతెలియని వృద్ధుని (60) మృతదేహంను శుక్రవారం గుర్తించారు. ఉస్మాన్‌నగర్ వలంటీరు సత్యం పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటన స్థలానికి ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి చేరుకున్నారు. మద్యంలో పురుగుల నివారణ మందు కలుపుకొని తాగి మృతి చెందినట్లు అనుమానించారు. మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం మోసంపై కేసు నమోదు

కలికిరి : స్థానిక ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం వద్ద నగదు తీసుకోవడానికి వచ్చిన తన దృష్టి మరల్చి మాట కలిపి కార్డు మార్చి ఇచ్చి.. ఆపై నగదు డ్రా చేసి మోసం చేసినట్లు ఈ నెల 1న పూజారి చంద్ర మీడియా ముందు వాపోయాడు. ఏటీఎం నుంచి రూ.45 వేలు నగదు డ్రా చేశారని ఆయన పేర్కొన్నాడు. అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ ఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మధుసూదనాచారి తెలిపారు. సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించి నిందితున్ని గుర్తించిన తరువాత కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

కలకడ : రైతుల పంట పొలాల వద్ద కేబుల్‌వైర్, పైపులు, స్టాటర్లు వంటివి చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. గుర్రంకొండ మండలం సరిమడుగు గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు సాంబశివ, గుడిబండ పంచాయతీ యల్లంగుడిబండ దళితవాడ గ్రామానికి చెందిన ఓబులేశు కుమారుడు కస్తూరిబాలాజిలను శుక్రవారం మండలంలోని కోన క్రాస్ వద్ద అరెస్ట్ చేశారు. వారిని వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జోనల్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ

కడప స్పోర్ట్స్ : జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారిణులు మహిళల క్రికెట్‌లో సత్తా చాటుతున్నారు. ఇటీవల నిర్వహించిన అంతర్ జిల్లాల జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ వయో విభాగాల్లో జిల్లా జట్టులో రాణించడంతోపాటు సౌత్‌జోన్ జట్టుకు ఎంపికయ్యారు. ఇటీవల వెంకటగిరిలో నిర్వహించిన అండర్–15, అండర్–19, అండర్–23, సీనియర్ విభాగాల్లో రాణించారు. అండర్–15 విభాగంలో ప్రశంస, అనురాధ, స్టాండ్‌బైలుగా శ్రీచందన, చైత్రలు ఎంపికయ్యారు. అండర్–19 విభాగంలో ప్రియాంకరెడ్డి, ప్రశంస, అండర్–23 విభాగంలో ఎ.శిరీష, ఎస్.శ్రీచరణి, కె.ఓబులమ్మ, కె.ప్రియాంకరెడ్డి ఎంపికయ్యారు. సీనియర్ విభాగంలో ఎ.శిరీష, ఎస్.శ్రీచరణి, ఎస్.మౌనిక, సి.వైష్ణవిలు ఎంపికై జోనల్ పోటీల్లో రాణించారు.

భక్తుల కొంగుబంగారం ముత్తుమారెమ్మ

- తమిళుల ఆరాధ్యదైవం
- అరవపల్లెలో వెలసిన ఆలయం
- సదరన్‌రైల్వేలో ఉన్న కాలంలో నిర్మితం
- నేటి నుంచి మూడు రోజుల పాటు జాతర



ముత్తుమారెమ్మ కోవెల



గర్భాలయం

నందలూరు(రాజంపేట) : ఇది 1955 అప్పటి మాట.. అప్పుడు నందలూరు రైల్వేకేంద్రం సదరన్ రైల్వేలో వైభవంగా కొనసాగుతుండేది. స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ తమిళనాడులోని అరక్కోణం, ఆంధ్రప్రదేశ్‌లోని నందలూరులో స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ కర్మాగారం ముంబాయి–చెన్నై రైలు మార్గంలో ఉండేది. తమిళనాడుకు చెందిన వందలాది మంది కార్మికులు నందలూరు రైల్వేకేంద్రంలో ఉండేవారు. వీరంతా అధికంగా రైల్వేకేంద్రం సమీపంలోని పల్లెలో ఉండటంతో అది అప్పటి నుంచి అరవపల్లెగా పిలవబడుతూ నేటికీ అలాగే కొనసాగుతోంది. తమిళనాడు ప్రాంతంలో ముత్తుమారెమ్మను ఆరాధ్యదైవంగా కొలుచుకుంటారు.

తమ సంప్రదాయంలో...

తమిళనాడు ప్రాంతానికి చెందిన వారు తమ సంప్రదాయంలో భాగంగా అరవపల్లెలో కూడా వారు ముత్తుమారెమ్మ గుడిని నిర్మించుకున్నారు. ఈ గుడి మొదలియార్ కుటుంబీకులు నిర్వహిస్తూ వస్తున్నారు. తరతరాలుగా మొదలియార్ కుటుంబీకులు, స్థానికంగా ఉన్న వారితో కలిసి ఏటా జాతర నిర్వహిస్తున్నారు.

జోన్ మారడంతో..

1977లో సదరన్ రైల్వే నుంచి సౌత్‌సెంట్రల్ రైల్వే పరిధిలోని నందలూరు వెళ్లిపోయింది. వందలాది మంది తమిళ కార్మికులు చెన్నై, కంచి, సేలం అరక్కోణం, మధురై తదితర ప్రాంతాలకు వెళ్లిపోయారు. వెయ్యికిపైగా తమిళ కుటుంబాలు ఉన్న నందలూరులో 30 కుటుంబాలకు పరిమితమైందని చెప్పుకోవచ్చు.

కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా..

కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ముత్తుమారెమ్మ భక్తులతో కొలవబడుతోంది. ప్రత్యేకించి తమిళుల కుటుంబాలు ఆరాధ్యదైవంగా కొలుస్తున్నారు. ఇక్కడ వారు అమ్మవారిని తరతరాలుగా కొలుస్తూ వస్తున్నారు. నందలూరు రైల్వేకేంద్రంలోని అరవపల్లెలో ముత్తుమారెమ్మ కోవెలను.. 1955లో విధుల నిమిత్తం ఇక్కడికి వచ్చిన తమిళులు నిర్మితం చేసుకొని, దినదినాభివృద్ధి చేస్తూ వచ్చారు.

12 నుంచి 14 వరకు జాతర

ఈ నెల 12న నుంచి 14 వరకు అమ్మవారి జాతర నిర్వహిస్తున్నారు. 12న శనివారం అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా చెక్కభజన, కాళికా నృత్యం, విచిత్రవేషధారణలు, కేరళ వాయిద్యాలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 13న జాతర నిర్వహిస్తారు. 14న అమ్మవారికి పాలపూజ ఉంటుంది.

అందరి సహకారంతో వైభవంగా జాతర



నందలూరు రైల్వేకేంద్రంకు అత్యంత సమీపంలో అరవపల్లె, అందులో అమ్మవారి కోవెల ఏర్పాటైంది. రైల్వేతో జనజీవన ముడిపడి వుంది. అది అలాగే నేటికీ కొనసాగుతోంది. అందరి సహకారంతో ముత్తుమారెమ్మ జాతర వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. మా పూర్వీకులు నుంచి అమ్మవారి కోవెల ఉందన్నారు. అప్పటి నుంచి కోవెల నిర్వహణ చేపడుతూ వస్తున్నాం. – సేలం వెంకటరమణ మొదలియార్, ధర్మకర్త, అరవపల్లె

వ్యక్తి అదృశ్యం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారిపల్లెకు చెందిన నాగేంద్ర అనే వ్యక్తి ఐదు రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కస్తూరిరాజుగారిపల్లికి చెందిన నాగేంద్ర డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చాడని తండ్రి మందలించడంతో ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏనుగు మృతి కేసులో నిందితుడి అరెస్ట్

రైల్వేకోడూరు అర్బన్ : మండల పరిధి దేశెట్టిపల్లి బీటు సమీపంలోని వీపీఆర్ కండ్రిగ పంచాయతీలో చీకటి నరసమ్మకు చెందిన మామిడితోటలో ఈ నెల 2న విద్యుత్ షాక్‌కు గురై ఏనుగు మృతి చెందిన విషయం తెలిసిందే. ఏనుగు మృతికి కారకులైన ముగ్గురు వ్యక్తులను గుర్తించడం జరిగిందని బాలపల్లి రేంజర్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. వారిలో ముక్కావారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన కుప్పచర్ల ఈశ్వరయ్యను అరెస్ట్ చేసినట్టు పేర్కొన్నారు. అతని దగ్గర నుంచి అల్యూమీనియం వైరు, కర్రలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలాగే కుప్పచర్ల మల్లిఖార్జున, కుప్పచర్ల ప్రసాద్‌లు పరారీలో ఉన్నట్టు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన కార్యక్రమంలో డీఆర్‌వో చంద్రకళ, ఎఫ్ఎస్‌వో బాలచంద్రుడు, ఎఫ్‌బీవో సుబ్బలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రి

- సిద్దవటంలో రూ.6 కోట్లతో ఏర్పాటు
- ప్రారంభించిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్యే మేడా



శిలాఫలకం ఆవిష్కరణలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్యే మేడా

సిద్దవటం : కార్పొరేట్‌కు దీటుగా సిద్దవటంలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఈ ఆసుపత్రి శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించగా, నూతన భవనాన్ని జెడ్పీ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సిద్దవటంలో రూ.6 కోట్లతో 30 పడకల వైద్యశాల ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. మరోమారు ఆయన్ను ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ గతంలో ఆసుపత్రిలో చూపించుకోవాలంటే పట్టణ ప్రాంతాలకు వెళ్లే వారన్నారు. రోడ్లు సరిగా లేక, బస్సులు నిర్దీత సమయానికి రాక ఇబ్బందులు పడేవారన్నారు. గతంలో సిద్దవటంలో ఉన్న సీహెచ్‌సీలో సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉండేవన్నారు. ఈరోజు ఉద్యాన వనంలో పెద్ద వైద్యశాల ఏర్పాటు అయిందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎ హిమదేవి, వైద్యాధికారి మధుశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీష్‌కుమార్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఆసుపత్రి డైరెక్టర్‌లు గోపాలస్వామి, మల్లు వెంకటసుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దీపం లక్ష్మీదేవి, మాజీ చైర్మన్‌లు ఏకుల రాజేశ్వరిరెడ్డి, జవహర్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగం మండల కన్వీనర్ పల్లె సుబ్బరామిరెడ్డి, యూత్ కన్వీనర్ క్రిష్ణచైతన్య, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, వైఎస్ఆర్‌సీపీ మండల అధికార ప్రతినిధి ఉపాసి వెంకటరమణారెడ్డి, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, శోభన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రెప్పపాటులో దూసుకొచ్చిన మృత్యువు

డిగ్రీ విద్యార్థిని బలిగొన్న బొలేరో



సంఘటన స్థలంలో మృతి చెందిన నాసీర్

కురబలకోట : రెప్పపాటులో మృత్యువు దూసుకొచ్చింది. డిగ్రీ విద్యార్థిని బలిగొంది. కురబలకోట మండలం అంగళ్లు గ్రామం విశ్వం కళాశాల సమీపంలో బొలేరో వాహనం ఢీకొనడంతో ఓ విద్యార్థి దుర్మరణం చెందాడు. ముదివేడు ఎస్‌ఐ ముబీన్ తాజ్ కథనం మేరకు.. కురబలకోట కస్పాకు చెందిన వేంపల్లె సాబ్‌జాన్ (లూలు) కుమారుడు వేంపల్లె నాసీర్ (18) రెండు రోజుల క్రితం మదనపల్లెలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీసీఏలో చేరారు. శుక్రవారం కళాశాల నుంచి మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలు దేరాడు. మార్గంమధ్యలో అంగళ్లు గ్రామం విశ్వం కళాశాల దగ్గరున్న పెట్రోల్ బంకు వద్ద వస్తుండగా ఎదురుగా అరటికాయల లోడుతో వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఎగిరి పడిన నాసీర్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బొలేరో వాహనాన్ని వదిలి డ్రైవర్ పరారయ్యాడు. సంఘటన స్థలంలో తల్లిదండ్రులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతు సంక్షేమానికి కమిటీలు కృషి చేయాలి



మార్కెటింగ్‌శాఖ అధికారులతో సమీక్షిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : రైతు సంక్షేమానికి మార్కెట్ కమిటీలు కృషి చేయాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కడప మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో శుక్రవారం మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన మార్కెటింగ్ కమిటీ కార్యకలాపాలను ఆర్‌జేడీఎంను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతు సంక్షేమం కోసం మార్కెట్ కమిటీలు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, కమిటీ ఆదాయ వనరులపై చర్చించారు. మార్కెట్ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం చేపట్టవలసిన ఇతర కార్యక్రమాలపై అధికారులతో చర్చించి ప్రభుత్వానికి తెలియచేయుటకు ప్రతిపాదలను తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు రామాంజనేయులు, ప్రాంతీయ ఉప మార్కెటింగ్ సంచాలకులు శ్రీకాంత్‌రెడ్డి, కడప ఏడీఎం ఆజాద్‌వల్లి, మార్కెటింగ్‌శాఖ డీఈ సంపత్‌బాబు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ నికరలాభం రూ.9543 కోట్లు



మాట్లాడుతున్న ఎల్‌ఐసీ ఎస్‌డీఎం గిరిధర్

కడప కల్చరల్ : ఎల్‌ఐసీ సంస్థ 2023 జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో 9543.71 కోట్ల రూపాయల లాభాలను సాధించిందని ఆ సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ తెలిపారు. 2023–24 తొలి త్రైమాసిక ఫలితాలు విడుదలైన సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2022తో పోల్చినపుడు ఎల్‌ఐసీ తాజాగా సాధించిన లాభాలు 198 శాతం అధికమని పేర్కొన్నారు. ఇదే కాలంలో ఎల్‌ఐసీ 4.61 శాతం మేర వ్యక్తిగత బీమాలో వృద్ధి సాధించిందని తెలిపారు. పాలసీ తీసుకున్నాక దాని కొనసాగింపును పర్సిస్టెన్సీ పేరుతో లెక్క కడతామని, అలాంటపుడు ఎల్‌ఐసీ ప్రీమియంల పర్సిస్టెన్సీలో మంచి పెరుగుదల ఉందని చెప్పారు. ఇది ఎల్‌ఐసీపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని, సేవల పట్ల సంతృప్తిని తెలుపుతోందని వివరించారు. ఎల్‌ఐసీ ఆస్తుల విలువ జూన్ 2022 నాటికి 41.02 లక్షల కోట్లు కాగా, 2023 నాటికి 46.11 లక్షల కోట్లకు చేరిందన్నారు. పాలసీదారుల నిధులను పెట్టుబడులుగా పెట్టగా, జూన్ 2022 త్రైమాసికంలో 7.74 శాతం రాబడి వచ్చిందని, అదే జూన్ 2023లో 8.78 శాతం రాబడి వచ్చిందని, ఎల్‌ఐసీ లాభాలు నిలకడగా పెరుగుతున్నాయని వివరించారు. ప్రజలు, పాలసీదారుల విశ్వాసం కారణంగానే 2023 జూన్‌లో మరింత మెరుగైన ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

కువైట్‌లో ఒంటిమిట్ట వాసి మృతి



శివప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య భారతి

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని మాడా వీధికి చెందిన సూరె శివప్రసాద్(42) అనే వ్యక్తి గురువారం రాత్రి కువైట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... 10 ఏళ్ల కిందట సూరె శివప్రసాద్, అతని భార్య భారతి బతుకు దెరువు కోసం కువైట్‌కు వెళ్లారు. ఈ క్రమంలో 2023 మేలో తమ స్వగ్రామం ఒంటిమిట్టకు వచ్చారు. మళ్లీ తిరిగి 2023 జూలై 28న కువైట్‌కి వెళ్లారు. గురువారం రాత్రి కువైట్ ఎయిర్‌పోర్టులో పని ముగించుకుని తన సొంత కారులో రూమ్‌కు వెళ్తుండగా వెనుకవైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కువైట్‌లోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోక సంద్రంలో మునిగి పోయారు. శివప్రసాద్‌కు భార్య భారతి, ఇద్దరు మగ పిల్లలు వెంకట కార్తిక్(15), వెంకట యోగేష్(10) ఉన్నారు. శివప్రసాద్ మృతదేహం శనివారం తెల్లవారుజామున స్వగ్రామం చేరుకుంటుందని, దహన సంస్కారాలు ఆ రోజే ఉంటాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు

వేంపల్లె : క్యాంపస్ ఇంటర్వ్యూలలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు రూ.5.50 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు వచ్చినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లో మాపెల్ ల్యాబ్స్ సంస్థ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలను నిర్వహించింది. సీఎస్ఈ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు జరిపిటి చందు, మద్దినేని అనిల్‌కుమార్, ఉప్పరకోట ఆంజనేయులు, ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, చాకలి అనిల్‌కుమార్, పి.మోహన్‌రాజు, జి.రవిచంద్ర, పి.మౌనికలు ఎంపికయ్యారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

మైదుకూరు : విద్యుత్ శాఖలో పని చేస్తూ విద్యుత్ చౌర్యానికి పాల్పడినందుకు తమ శాఖలోని లైన్ ఇన్‌స్పెక్టర్ బి.నారాయణరెడ్డిని సస్పెండ్ చేసినట్లు మైదుకూరు విద్యుత్ ఈఈ జీవీ రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఖాజీపేట మండలం ఏటూరు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న నారాయణరెడ్డి మైదుకూరులో నివాసం ఉంటున్నాడని పేర్కొన్నారు. కొద్ది రోజుల కిందట విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో నారాయణరెడ్డి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్టు తేలిందన్నారు. వారి నివేదిక మేరకు నారాయణరెడ్డిని సస్పెండ్ చేసినట్లు ఈఈ తెలిపారు.

నాందేడ్-విల్లుపురం మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నాందేడ్-విల్లుపురం (07415/16) మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ నెల 12, 13 తేదీలలో ఈ రైలును నడుపుతున్నారన్నారు. 12వ తేదీ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి కడపకు మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు చేరుకుని మధ్యాహ్నం 1.30 గంటలకు విల్లుపురం వెళుతుందన్నారు. తరువాత విల్లుపురంలో అదే రోజు సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి కడపకు అర్ధరాత్రి 12.28 గంటలకు చేరుకుని సాయంత్రం 5.45 గంటలకు నాందేడ్‌కు చేరుతుందన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెండు ట్రిప్‌లు నడుపుతున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ రైలు తిరుమన్నామలై, వేలూరు, కాటాప్డి, రేణిగుంట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాదగిరి, సేరం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామా బాద్ స్టేషన్లలో ఆగుతుందన్నారు.

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన వెంకటరమణమ్మ

మదనపల్లె : రెండు నెలల క్రితం కుమారుడి ఆత్మహత్య, కొంత కాలంగా భర్తకు తీవ్ర అనారోగ్యం తదితర సమస్యలతో మానసికంగా కుంగుబాటుకు గురై ఓ మహిళ అర్ధాంతరంగా తనువు చాలించిన ఘటన గురువారం రాత్రి జరిగింది. మండలంలోని కాట్లాటపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి, వెంకటరమణమ్మ(46) దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఓబుల్‌రెడ్డి కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో వీరి కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ కుటుంబానికి అండగా ఉండేవాడు. రెండునెలల క్రితం కిరణ్‌కుమార్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలో కుమారుడి జ్ఞాపకాలు తరచూ గుర్తుకు వస్తుండటంతో ఓబుల్‌రెడ్డి దంపతులు మదనపల్లె పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్నారు. కొద్దిరోజులుగా పెళ్లి ఈడుకు వచ్చిన కుమార్తెను, అనారోగ్యంతో ఉన్నటువంటి భర్తను పోషించలేక, ఆలనాపాలన చూడలేక రమణమ్మ మానసికంగా కుంగిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది వైఎస్సార్ కాలనీలోని ఇంట్లో గురువారం రాత్రి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

అనారోగ్యంతో..



చలపతి మృతదేహం

అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని పోతబోలు పంచాయతీ సిద్ధమ్మగారిపల్లెకు చెందిన రామన్న కుమారుడు చలపతి(53) మదనపల్లె శివాజీనగర్‌లో నివాసం ఏర్పరచుకుని ప్రైవేట్ వాహన డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య శంకరమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా చలపతికి విపరీతమైన మోకాలినొప్పులు ఉండటంతో తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సెప్టెంబర్ 4న మోకాలికి శస్త్రచికిత్సలు చేసేందుకు డాక్టర్లు తేదీ నిర్ణయించారు. మోకాలినొప్పులు అధికం కావడం, అనారోగ్యం భరించలేక శుక్రవారం స్వగ్రామమైన సిద్ధమ్మగారిపల్లెలో ఇంటి సమీపంలోని చింతచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.